క్లుప్తంగా

జీజీహెచ్‌కి వైద్య పరికరాలు వితరణ



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కి దాతలు వైద్య పరికరాల్ని అందజేయడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ వ్యాపారస్తులు డి.సుబ్రహ్మణ్యం సతీమణి నాగమణి జ్ఞాపకార్థం సోమవారం కుటుంబ సభ్యులు రూ. 1.75 లక్షల విలువైన 11 ఆక్సిజన్ సిలెండర్లు, కార్డియో టోటోగ్రఫీ, ఆక్సిజన్ గేజ్ ఫ్లో మీటర్లను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో డి. మురళీకృష్ణ, డి.అపర్ణ లక్ష్మి, గంధం మురళీకృష్ణ, గంధం శ్రీదేవి పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసు కేసు నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ఒక విద్యార్థిపై అధికారులు కేసు నమోదు చేశారు. సోమవారం సీనియర్ ఇంటర్ మ్యాథ్స్–2బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు దరఖాస్తు చేసిన 26,510 మంది విద్యార్థుల్లో 25,951 మంది హాజరయ్యారు. 1,105 మంది ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల్లో 1,039 మంది హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఒకేషనల్ సబ్జెక్టు పరీక్ష రాస్తూ కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థిపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదైంది.

మహిళను వేధిస్తున్న పలువురిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: మహిళను ఆమె భర్త, అత్తమామలు, బంధువులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్వీఎన్ కాలనీలో నివసించే వంగల సింధు సాహికి, జగదీశ్వరరెడ్డికి 15 సంవత్సరాల కిందట వివాహమైంది. జగదీశ్వరరెడ్డి మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యను కొట్టి వేధిస్తున్నాడు. దీనికి తల్లి భారతి, తండ్రి పెదనరసింహారెడ్డి, బంధువులు సహకరిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

ఇంట్లో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమౌళీనగర్‌లో నివశించే మర్రి లక్ష్మి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు బీరువా తాళాలు తీసి అందులో రూ. 80వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ. 20వేలు నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టి డబ్బులు పోగొట్టుకున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ స్కై యాప్ ద్వారా డి.వెంకటేశ్వర్లు ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. యాప్ నిర్వాహకులు చెప్పినట్లు పలు అకౌంట్లకు రూ. 5.60 లక్షలు పంపాడు. అనంతరం స్పందించక పోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని కలిగి ఉండాలి



గుంటూరు రూరల్: చిన్ననాటి నుంచి విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్ ఉమా శంకర్‌రెడ్డి తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పొత్తూరులో వారం రోజుల పాటు నిర్వహించనున్న పలు సేవా కార్యక్రమాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ, రసాయనిక ఎరువులు, సేంద్రియ వ్యవసాయం, ఓటు ఆవశ్యకత, విద్య, డిజిటల్ విద్య తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, సచివాలయం అడ్మిన్ సౌమ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వరూప, వీఆర్వో బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డి శ్రీనివాసులు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

తెనాలి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అరెస్టు చేశారు. కొల్లిపరలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి. చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 10 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి రైల్వే స్టేషన్ ఐదో ప్లాట్‌ఫారం వైపు నుంచి అమరావతి ప్లాట్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాల్ని తీసుకెళుతున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నగర సుందరీకరణకు చిత్తశుద్ధితో కృషి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు పశ్చిమ స్వరూపాన్ని మార్చేశాం
- ఎన్నో మంచి రోడ్లు వేశాం



రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరి

పట్నంబజారు: గుంటూరు నగరమంతా అత్యాధునిక రహదారులు నిర్మిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పట్టాభిపురం మూడో లైను ప్రాంతంలో నూతనంగా పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పట్టాభిపురం రెండు, మూడు లైన్లుకు ప్రధాన రహదారులు, మధ్యలో ఒక అడ్డరోడ్డు.. హెచ్ ఆకారంలో ఈ రోడ్లను రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నేపథ్యంలో సోమవారం జరుగుతున్న పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ గుంటూరులోని అన్ని రహదారుల్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని వీధులు నూతన రోడ్లతో కళకళలాడుతున్నాయని చెప్పారు. అభివృద్ధి అంటే ఏమిటో చేతల ద్వారా చేసి చూపిస్తున్నామని, ఏ వీధిని వదిలిపెట్టకుండా రోడ్లు వేస్తున్నామని వివరించారు. గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశామని, ప్రజలు రాకపోకలు సాగించేందుకు సౌకర్యవంతంగా ఉండేలా రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, గుంటూరును భవిష్యత్తులో మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ప్రజలందరి ఆశీర్వాదం తమకు ఉందని, వచ్చే ఎన్నికల్లోనూ విజయఢంకా మోగిస్తామని మంత్రి రజిని ధీమా వ్యక్తం చేశారు. ==నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో రామనామక్షేత్రం రోడ్డు, పట్టాభిపురం మెయిన్‌రోడ్డు, బ్రాడీపేట ఒకటో లైనుతో పాటు పలు రహదారుల్ని నిర్మించినట్లు తెలిపారు. ఇంకా పలు ప్రధాన రహదారులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. ప్రతిపక్షాల గోబెల్స్ ప్రచారాన్ని నమ్మొద్దని, వాస్తవాలు గ్రహించి, వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి టీఎల్‌వీ ఆంజనేయులు, పార్టీ నేతలు ఇన్నారెడ్డి, మాణిక్యాలరావు, దినేష్, గడ్డం అంజి, వెంకటేశ్వరరెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే ఆలయాల పరిరక్షణ



మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పట్నంబజారు: దేవాలయాల పరిరక్షణ విషయంలో తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. సంగడిగుంటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురు లైనులో గొల్లా ఆంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి విడదల రజిని మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఎన్నో ఆలయాలను కూల్చివేశారని, తమ ప్రభుత్వం వచ్చాక ఆ ఆలయాలన్నింటిని పునః నిర్మించామని తెలిపారు. అర్చకులకు నెలకు రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్నామని చెప్పారు. చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం కూటములు కడుతుంటారని, గత ఎన్నికలలో బీజేపీని తిట్టి, ఇప్పుడు జతకట్టారని దుయ్యబట్టారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరి వాడు కాదని, కోట్లాదిమంది ప్రజల అండదండలు ఆయనకు ఉన్నాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్. జగన్‌కు ఆ భగవంతుడి ఆశీస్సులు ఉన్నాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరిని ఘనంగా దుశ్శాలువతో సత్కరించారు.

ఉపాధి, పారిశ్రామిక దిక్సూచిగా ఏపీ

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



మేడపాటికి జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఉపాధి రంగాలకు దిక్సూచిగా నిలుస్తుందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. వాయిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో పరిశ్రమలు, ఉపాధి కల్పించే అధికారులకు సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విశాఖ పారిశ్రామిక రాజధానిగా దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఏపీఎన్ఆర్‌టీ చైర్మన్ వెంకట్ ఎస్ మేడపాటి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన ఇచ్చి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఏపీఎన్ఆర్‌టీ ద్వారా ఉచితంగా జీఆర్ఈ, టోఫెల్, ఐఈఎల్టీఎస్ కోచింగ్‌లు ఇస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయంగా ఉన్నత విద్య అవకాశాల్ని రాష్ట్ర విద్యార్థులకు అందించాలనే దృఢ సంకల్పంతో ఈ కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో డాక్టర్ డి.వి.రామకోటిరెడ్డి మాట్లాడుతూ మరో ఐదేళ్లలో పారిశ్రామిక రాజధానిగా ఏపీ గుర్తింపు పొందుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ఏటా దాదాపు లక్ష మంది విద్యార్థులు ఆయా కోర్సులు పూర్తి చేస్తున్నారని, అందులో 60 వేల మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. ఏ విద్యార్థి కూడా నిరుద్యోగిగా ఉండకూడదని లక్ష్యంతో సీఎం రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పడుతున్న పారిశ్రామిక పార్కులు, పోర్టులు, షిప్పింగ్ యార్డులు వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. చెన్నై హెచ్‌సీఎల్ ప్రతినిధి వినోద్ మాట్లాడుతూ ఏపీ ఐటీఏ, హెచ్‌సీఎల్‌లు సంయుక్తంగా డేటా ఇంజినీరింగ్, ఫుల్‌స్టాక్ జావా కోర్సులలో శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. విజయవాడ హెచ్‌సీఎల్ ప్రతినిధి సీహెచ్. సతీష్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ స్కిల్స్ మెరుగుపరుచుకోవాలని, దీని ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని వివరించారు. టెక్ మహేంద్ర ప్రతినిధి వి. శ్రీనివాస్‌రెడ్డి, ఫిక్సిటీ ఎడెక్స్ ఉపాధ్యక్షుడు మూర్తి నిరంజన్, విశ్వవిద్యాలయ రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్దయ్య, డీన్ ఈ. శ్రీనివాస్‌రెడ్డి, ఏపీటీపీఓ కన్సార్టియం సెక్రటరీ ఎన్.వి.సురేంద్రబాబు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయలపై అవగాహన పెంచుకోండి



యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల ప్రదర్శనలు

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- ఘనంగా ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఫెస్టివల్



విజ్ఞాన్ యూనివర్సిటీ వద్ద విదేశీ విద్యార్థిని, విద్యార్థులు

చేబ్రోలు: విదేశాల నుంచి వచ్చిన విద్యార్థులు భారతదేశంలోని సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవడానికి వచ్చే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఫెస్టివల్'ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్, ఘనా, కెన్యా, మడగాస్కర్, నేపాల్, నైజీరియా, సూడాన్, సౌత్ సూడాన్, టోగో, జింబాబ్వే, యూఏఈ, సిరియా దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. దేశాల మధ్య ఐక్యత, దేశ సంస్కృతులను పంచుకోవడం, నాలెడ్జ్ షేరింగ్ తదితర అంశాల ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంవత్సరంలో కనీసం 3–4 రోజులు స్థానిక స్నేహితులతో కలసి ఉంటే దేశం గురించి అర్థం చేసుకోవడానికి అవకాశం దొరుకుతుందన్నారు. ఆ విధంగా విద్యార్థులు తమ దేశాలకు, భారతదేశానికి మధ్య బలమైన సంబంధాలను నిర్మించడానికి రాయబారులుగా మారవచ్చునన్నారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ దేశాల మధ్య సరిహద్దులు లేకుండా మానవత్వం అభివృద్ధి చెందాలని నొక్కి చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకరి సంస్కృతిని మరొకరు అర్థం చేసుకోవడంతో పాటు స్నేహ భావాలను పెంపొందించుకోవడానికి కృషి చేయాలన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

గుడారాల పండుగ విజయవంతం

గుంటూరు రూరల్: హోసన్న మందిర్ ఆధ్వర్యంలో 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీలు తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల హోసన్న మందిర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రీస్తు నామాన్ని ఘన పరుస్తూ ప్రపంచ శాంతి కోసం నిర్వహించిన గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న క్రీస్తు భక్తులకు ఆయన కృప ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల కోసం సౌకర్యాలు కల్పించిన రైల్వేశాఖ, పోలీస్ శాఖ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, నగర మున్సిపల్ కార్పొరేషన్, పారిశుద్ధ్య సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, సహాయ సహకారాలు అందించిన క్రీస్తు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ ఫ్రైడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్, హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్స్, సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళి




అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నెహ్రూనగర్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ సోమవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఆయనకు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీపురంలోని దళిత ఆత్మ గౌరవ పోరాట సంఘం అధ్యక్షుడు గన్నెపూడి సుధాకర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కారు పార్కింగ్ విషయంలో డీఎస్పీ సుధాకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. ఆయనపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల్ని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, బండ్లమూడి స్టాలిన్, వేముల ప్రసాద్, జల్ది అనిల్ పాల్గొన్నారు.

కట్టెల పొయ్యిలో పడి వృద్ధురాలు మృతి

పెదకాకాని: వంట చేస్తున్న మహిళ ప్రమాదవశాత్తూ కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మరణించిన సంఘటన నంబూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని నంబూరు గ్రామానికి చెందిన పులి సాయమ్మ ఆదివారం రాత్రి కట్టెల పొయ్యి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ పొయ్యిలో పడిపోయింది. దీంతో శరీరమంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి పులి సాయమ్మ(83) మరణించింది. భర్త నాలుగు సంవత్సరాల క్రితమే చనిపోయాడు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



గుంటూరు రూరల్: చెస్ క్రీడ వల్ల క్రీడాకారుల్లో మేధో సంపత్తి మెరుగు పడుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. రెండు రోజులుగా నగర శివారుల్లోని లాం నందు చలపతి ఫార్మసీ కళాశాలలో కళాశాల, ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 265 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. విజేతలకు రూ.53 వేల నగదు బహుమతిని అందజేసినట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో గుంటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి విజేతగా నిలిచాడని, నాలుగు కేటగిరీలలో ప్రతి కేటగిరీ నుంచి మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో వెంకటేశ్వర్లు, రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్, పీడీ పి. భానుప్రకాష్ పాల్గొన్నారు.

25వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కరుణకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్‌లో రూ.1.90 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి సోమవారం శంకుస్థాపన చేశారు. సాయినగర్‌లో నరసరావుపేట రోడ్డు నుంచి అమ్మ ఆశ్రమం వరకు రూ.80 లక్షలతో క్రాస్ రోడ్లతో పాటు కాలువలు, డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణంతో పాటు లక్ష్మీనగర్, నేతాజీనగర్‌లో రూ.90 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కావేరీనగర్ 3వ, 6వ లైన్లలో రూ.20 లక్షలతో నిర్మించనున్న డబ్ల్యూబీఎం రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణకుమారి మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనుల్ని చేపట్టినట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ల్యాబ్, ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నగర అధ్యక్షుడు వెంకటలక్ష్మణ్‌ను సన్మానిస్తున్న జిల్లా కార్యవర్గం

గుంటూరు మెడికల్: ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ గుంటూరు టౌన్ అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన గ్లోబల్ ల్యాబ్స్ నిర్వాహకులు మద్దికాయల వెంకటలక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ సెక్రటరీగా బి.శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎస్.వెంకటరమణారావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని సోమవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, సెక్రటరీ తాడేకోరు శ్రీహరి, గౌరవ అధ్యక్షుడు బి.వి.ఎస్.కె.విశ్వనాథ్ ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. జాయింట్ సెక్రటరీగా కె.బాలు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.డి.మస్తాన్, ఈసీ మెంబర్స్‌గా పి.నాగరాజు, వి.బాలకోటేశ్వరరావు, కె.బాలకృష్ణ, పి.రాజశేఖర్, ఎస్.డి.మన్సూర్ అలి, టి.ఎస్.కోటేశ్వరరావు, సురేష్, ఐ.సాంబశివరావు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నగర కమిటీకి జిల్లా నేతలు రామ్మోహన్‌రావు, వెంకటకృష్ణ, రాజ్‌కుమార్, బాబ్జి అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయం



పూర్వ విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

తాడికొండ: పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయమని తుళ్లూరు కేవీఆర్ జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు గుత్తా శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలకు బెంచీలు బహూకరించిన 1994–95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు వర్రె కిరణ్‌కుమార్, జమ్ముల సతీష్, అమర్తి ఉమామహేశ్వరరావు, యంపరాల నరసింహారావు, తుళ్లూరుకు చెందిన వ్యాపారవేత్త పులిపాటి శ్రీనివాస్‌ను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు మూలమైన పాఠశాలను మరిచిపోకుండా తమవంతు సాయంగా పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి సేవ చేయడం ఎందరికో మార్గదర్శకమని పేర్కొన్నారు. పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో పూర్వ విద్యార్థులతో పాఠశాలలో సమావేశం త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులంతా స్వర్ణోత్సవ వేడుకలకు హాజరై మాతృసంస్థ రుణం తీర్చుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీచర్లు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ, తాగునీటి పరిశుభ్రతపై అవగాహన



కేవీపీ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్–1 విభాగ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో చేపట్టిన ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం తడిచెత్త, పొడిచెత్తను వేరుపరచి, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిరక్షణ గురించి వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండటంతో పాటు దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యల్ని స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారిణి ఎం. సంతోషకుమారి, కేఎస్సార్టీ నగరపాలకసంస్థ పాఠశాల ఉపాధ్యాయులు వై. థామస్‌రెడ్డి, జగదీష్‌బాబు, ఐటీసీ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: రైతుల అభ్యున్నతే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర తెలిపారు. గడిచిన 75 సంవత్సరాల్లో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతుల అభ్యున్నతి కోసం బీజేపీ ప్రభుత్వం కృషి చేసి సఫలమైందని ఆయన పేర్కొన్నారు. గుంటూరులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రైతుల కోసం పలు పథకాల్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోందని, వారి ఖాతాల్లోకి నేరుగా డబ్బులు వేస్తున్నట్లు వెల్లడించారు. పంట రక్షణ కోసం ఫసల్ బీమా యోజన ఇస్తోందని చెప్పారు. వ్యవసాయంలో కూడా మహిళల భాగస్వామ్యం పెంచే ఉద్దేశంతో ప్రధాని డ్రోన్ దీదీ స్కీమ్ తీసుకువచ్చారని తెలిపారు. డ్రోన్లతో పని త్వరగా పూర్తవుతుందని, 10 మంది రైతులు చేసే పని, ఒకే డ్రోన్ చేయగలదని వెల్లడించారు. పొలంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండానే మందు పిచికారి చేస్తుందని తెలిపారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల మహిళలకు డ్రోన్లు అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించడం ఈ పథకం ఉద్దేశమని నరేంద్ర వివరించారు. సమావేశంలో నేతలు పాలపాటి రవికుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల పీవైపీ ఎక్స్‌పో



పీవైపీ ఎక్స్‌పోలో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని: 'వివా ది స్కూల్'లో ఇంటర్నేషనల్ బాకలారియేట్ పీవైపీ చివరి సంవత్సరం విద్యార్థులు అభ్యసించిన అంశాలపై నైపుణ్యాలను ప్రదర్శించేందుకు సోమవారం ఏర్పాటు చేసిన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ ఎక్స్‌పో(పీవైపీ ఎక్స్) వేదిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఐబీ విధానం ద్వారా అభ్యసించిన విద్య, విద్యేతర అంశాలలో ప్రావీణ్యం సాధించిన నైపుణ్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు. ఇటీవల విద్యార్థులు సందర్శించిన పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టతను తెలియజేస్తూ రాసిన వ్యాసాలు, ఫోటోలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని వీక్షించారు. అనంతరం విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కెఎస్ రావు, ప్రిన్సిపల్ సీహెచ్ సరళ, ఐబీ సమన్వయకర్త కె మాధవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.